సాక్షి ఒడిశా

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,96,392లు, బంగారం 7 గ్రాముల 400 మిల్లీగ్రాములు వెండి 78 గ్రాముల 750 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



జై దుర్గా భవానీ..!

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు.

- IIలో▸



వినూత్న నిరసన

రాష్ట్రంలో అమీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై నిరుద్యోగులు నిరవధికంగా నిరసన తెలుపుతున్నారు.

- IIలో▸

న్యూస్‌రీల్

శరవేగంగా అభివృద్ధి పనులు



వెండింగ్ జోన్‌లో దుకాణాలు

జయపురం: మున్సిపాలిటీలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. అలాగే రెండు పార్కులకు, ఒక వెండంగ్ జోన్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కౌన్సిల్‌లో ప్రస్తుతం పట్టణంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతి వార్డులోనూ పార్కులు ఏర్పాటు జరిగాయని, అలాగే చెరువుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. పట్టణం మరింతగా అభివృద్ధి చెందేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత, కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్, కౌన్సిలర్లు ధనిమ హరిజన్, జస్పాల్ సింగ్, విష్ణువర్ధన రెడ్డి, ఉషారాణి దండసేన, మధుశ్మిత ఓరస్ పాల్గొన్నారు.

భారీ గుడ్లగూబ స్వాధీనం



గుడ్లగూబను స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

జయపురం: బొయిపరిగుడ అటవీ ప్రాంతంలో భారీ గుడ్లగూబను గొడగుడ గ్రామస్తులు గురువారం ఉదయం పట్టుకున్నారు. ఈ గుడ్లగూబ అస్వస్థతతో గ్రామ సమీపంలో ఉండి ఎటూ కదలలేకపోయింది. దీంతో వెంటనే గ్రామస్తులు దానిని కాపాడి బొయిపరిగుడ అటవీ విభాగ అధికారులకు తెలియజేశారు. అటవీ విభాగ అధికారి సందీప్ పాణిగ్రాహి, ఫారెస్టర్లు రాజేంద్ర ప్రధాన్, శ్రీనివాసరావు, లలిత హరిజన్, ఫారెస్టు గార్డు మనోరమ దేవి ఆ గ్రామానికి వెళ్లి గుడ్లగూబను స్వాధీన పరచుకున్నారు. దానికి వైద్యం చేయించేందుకు పశు చికిత్సాలయానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రస్తుతం చికిత్స చేస్తున్నామని, అయితే అస్వస్థత కారణంగా ఆహారం తినడం లేదని అటవీ అధికారి పాణిగ్రాహి వెల్లడించారు. ఆరోగ్యం కుదిటపడిన తర్వాత సురక్షిత ప్రాంతంలో విడిచిపెడతామని వెల్లడించారు.

దుకాణాల అద్దె ఖరారు



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ మహంతి తదితరులు

జయపురం: పట్టణ కోవిడ్ ఆస్పత్రి ప్రాంతంలో వెండింగ్ జోన్ దుకాణాల అద్దెను మున్సిపల్ కౌన్సిల్ ఖరారు చేసింది. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సభాగృహంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. దీనిలో భాగంగా వెండింగ్ జోన్‌లోని 30 దుకాణాలను ఒక వ్యక్తికి ఒక దుకాణం చొప్పున అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు. ఒక్కొక్క దుకాణానికి రూ.800 చొప్పున అద్దె ఖరారు చేశారు. అలాగే ప్రతీస్టాల్‌కు రూ.30 వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా వసూలుకు నిర్ణయించారు. అదేవిధంగా బిజూ వెండింగ్ జోన్ దుకాణాల అద్దె పెంచాలని సమావేశం నిర్ణయించింది. పట్టణంలోని మున్సిపాలిటీ దుకాణాల లబ్ధిదారులు కొంతమంది ఇతరులకు అద్దెకు ఇస్తున్నారని, అలాగే ఎంతోకాలంగా అద్దెలు చెల్లించడం లేదని, ఒకటికి మించి అధికంగా దుకాణాలు ఉన్న వారున్నారని, అటువంటి వాటిని గుర్తించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీలో కౌన్సిలర్లను సభ్యులుగా నియమిస్తారు.

ఒత్తిడితో మానసిక ఇబ్బందులు



మాట్లాడుతున్న బిమల్ రౌలో

పర్లాకిమిడి: అధిక ఒత్తిడితో మానసిక ఇబ్బందులు పెరుగుతాయని జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి బిమల్ రౌలో అన్నారు. గుమ్మా రోడ్డులో ఉన్న నియాతి దివ్యాంగుల పాఠశాలలో గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థుల వినికిడి యంత్రాల పనితనంపై డాక్టర్ అరుణ్ కుమార్ నాయక్ పరీక్షించారు. మానసిక దివ్యాంగుల కోసం పాఠశాల స్థాపించిన వ్యవస్థాపకుడు బిచిత్రానంద బెబర్తాకు బిమల్ రౌలో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్నేహలతా పాణిగ్రాహి, నియాతి పాఠశాల కమిటీ కార్యవర్గ సభ్యురాలు తనూజా శతపతి, సుమితా గొమాంగో, జ్యోత్స్నపాల్గొన్నారు.

పేకమేడ..!





ప్రమాద స్థలంలో కూలిన స్తంభాలు (ఇన్‌సెట్లో) కుప్పకూలిన భవంతి పైకప్పు

- కూలిన నిర్మాణ భవంతి
- ఒకరు దుర్మరణం
- పలువురికి తీవ్ర గాయాలు

భువనేశ్వర్:

నిర్మాణం జరుగుతున్న ఒక బహుళ అంతస్తు భవనం కూలడంతో ఘటనా స్థలంలో కార్మికుడు మృతి చెందాడు. మరో 4 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ విషాద సంఘటన ఢెంకనాల్ ప్రాంతం 55వ నంబర్ జాతీయ రహదారి మహిషాపట్ గ్రామ సమీపంలో జరిగింది. నిర్మాణ దశలో 4 స్తంభాలు కూలడంతో సుమారు 40 అడుగుల ఎత్తు నుంచి పైకప్పు అకస్మాతుగా కుప్పకూలింది. ఈ ప్రాంగణంలో పని చేస్తున్న 10 మంది కార్మికులు కూలిన భవనం కింద కూరుకుపోయినట్లు తెలుస్తోంది. ఢెంకనాల్ జిల్లా కలెక్టర్ సోమేష్ ఉపాధ్యాయ్, పోలీసు సూపరింటెండెంట్ అభినవ్ సోన్‌కర్, అదనపు జిల్లా కలెక్టర్ రమేష్ చంద్ర సెఠి, సబ్ కలెక్టర్ బిబుధా గొడొనాయక్, సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్‌డీపీఓ) బిభూతి మహాపాత్రో, అగ్నిమాపక విభాగం అధికారి ప్రశాంత కుమార్ ధొలొ ప్రత్యక్షంగా ఘటనా స్థలం సందర్శించారు. సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాలు పర్యవేక్షించారు. బాధితులను జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మృతుడు ఢెంకనాల్ జిల్లా ఇందుపూర్ పంచాయతీ ఖుంటుఝొరి గ్రామస్తుడు సుధాంశు రౌత్ (మున్నా)గా గుర్తించారు. గాయపడిన వారిలో సమరేంద్ర రౌత్, కైలాస్ రౌత్ పరిస్థితి విషమంగా కొనసాగుతుంది. వీరిలో ఒకరి 2 చేతులు తెగిపోగా మరొకని నడుం, కాళ్లు విరిగినట్లు ప్రాథమిక సమాచారం. జాతీయ విపత్తు స్పందన దళం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఒడిశా విపత్తు స్పందన దళం ఒడ్రాఫ్ వర్గాలతో స్థానిక అగ్ని మాపక దళం కూలిన భవంతి కింద కూరుకుపోయిన వారి కోసం గాలిస్తున్నారు.



ప్రమాద స్థలంలో బాధితుల కోసం గాలింపు చర్యలు

నీ స్థానం.. సుస్థిరం



రాయగడ: రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న దృశ్యం

- రతన్ టాటాకు ఘన నివాళి

భువనేశ్వర్: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతిపై సర్వత్రా విచారం నెలకొంది. రాజకీయ, పారిశ్రామికవేత్తలు ఇతరేతర రంగాల్లో ప్రముఖులు ఆయన మృతిపై ప్రగాఢ సంతాపం ప్రకటించారు. రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్, స్పీకర్ సురమా పాఢి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, విపక్ష నేత నవీన్ పట్నాయక్ తదితర ప్రముఖులు రతన్ టాటా మానవాళి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. దేశానికి ఆయన లేని లోటు తీరనది అన్నారు.

రాయగడలో...

దేశంలో అనేక మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించిన ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు స్థానిక సర్క్యూట్ హౌస్‌లో రాయగడ నాగరిక మంచ్ నివాళులర్పించింది. ఆయన మరణం తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచ్ అధ్యక్షుడు బాదల్ కుమార్ ఢా, సరస్వతీ శిశు మందిర్ కార్యదర్శి ప్రమోద్ మహంతి, స్వయం సేవక్ సంఘం ప్రతినిధులు హరీష్ చంద్ర, దీపక్ రౌత్ తదితరులు పాల్గొన్నారు.



పూరీ సాగర తీరంలో సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ సైకత శ్రద్ధాంజలి



శాండ్ యానిమేటర్ మానస కుమార్ సాహు ప్రదర్శించిన కళాత్మక సైకత యానిమేషన్ శ్రద్ధాంజలి

బావిలో పడిన గున్న ఏనుగు



బావిలో పడిన గున్న ఏనుగు



బావి నుంచి బయటకు వస్తున్న గున్న ఏనుగు

భువనేశ్వర్: కలహండి జిల్లా జమపాడా గ్రామం పొలిమేరల్లో 5 అడుగుల లోతు ఉన్న పాడుబడిన బావిలోకి ప్రమాదవశాత్తు గున్న ఏనుగు జారింది. ఆహార అన్వేషణ కోసం గుంపుగా వచ్చిన ఏనుగుల నుంచి దారి తప్పి గున్న ఏనుగు ఇలా ప్రమాదానికి గురై ఉంటుందని భావిస్తున్నారు. నొర్లా అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలం సందర్శించి బావిలో పడిన గున్న ఏనుగుని సురక్షితంగా గట్టెక్కించారు. అటవీ ప్రాంతంలోకి ప్రవేశించిన దీనిపై అటవీ శాఖ అధికారులు నిఘా వేశారు. సంబంధిత గుంపులో చేరడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



పాటలతో ఉర్రూతలూగిస్తున్న భువనేశ్వర్ కళాకారులు

జయపురం: దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పూజా కమిటీ నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను అలరిస్తున్నాయి. బుధవారం రాత్రి బసంతమాయి మందిర ప్రాంతంలో, జగజ్జననీ మందిర కూడలి వద్ద ప్రదర్శనలు ఇచ్చారు. జయపురం ఎమ్మెల్యే, దసరా వేడుకల కమిటీ అధ్యక్షుడు తారాప్రసాద్ బాహిణీపతి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, కమిటీ సభ్యులు మదన మోహన్ నాయిక్, నిహారంజన్ బిశాయి, దేవేంద్ర బాహిణీపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేడీకి ప్రకాష్ బెహరా గుడ్ బై



ప్రకాష్ బెహరా

భువనేశ్వర్: మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ బెహరా బిజూ జనతా దళ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌కు లిఖితపూర్వకంగా తెలియజేశారు. లోగడ భారతీయ జనతా పార్టీ ఫిరాయించి బిజూ జనతా దళ్‌లో చేరారు. అంతకుముందు కాంగ్రెసు అభ్యర్థిగా కటక్ జిల్లా సాలేపూర్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. తదుపరి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసు సభ్యత్వానికి రాజీనామా చేసి, 2019 సంవత్సరంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. సాలేపూర్ స్థానం నుంచి బీజేపీ టికెటుతో పోటీ చేసి పరాజయం చవి చూశారు. గత ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థిగా కటక్ బరాబటి నియోజకవర్గం నుంచి పోటీ చేసి మరోసారి పరాజితునిగా నిలిచారు. కాంగ్రెసు పార్టీ వీడిన నుంచి ప్రకాష్ బెహరాకు కలిసి రావడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆయన తిరిగి కాంగ్రెసు గూటికి చేరుతారనే ఊహాగానాలు వ్యాప్తిలో ఉన్నాయి.

మత్స్యకారులకు బోట్లు పంపిణీ



జలాశయంలో నాటు పడవపై షికారు చేస్తున్న ఎంపీ బలభద్ర మాఝి



మత్స్యకారులకు వలలు అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో ఉన్న బలిమెల రిజర్వాయర్ మత్స్యకారులకు నవరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మాఝి రాష్ట్ర ప్రభుత్వం తరుపున 40 నాటు పడవలు, 80 లైఫ్ జాకెట్స్, 150 వలలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధికి పాటుపడతామని తెలియజేశారు. రానున్న రోజుల్లో 10 రెట్లు ఎక్కువగా చేపలు ఉత్పత్తి అయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మరో 300 పడవలు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో చిత్రకొండ ఎమ్మెల్యే మాంగు ఖీలో, చిత్రకొండ సమితి సభ్యురాలు రాజేశ్వరీ ఖీలో ఇతరులు పాల్గొన్నారు.



మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న అధికారుల

నాటుసారా బట్టీలపై దాడులు



నాటుసారా వంటశాలపై పోలీసుల దాడి

భువనేశ్వర్: స్థానిక సాలియా సాహిలో సారా బట్టీలపై అబ్కారీ శాఖ పోలీసులు ఆకస్మిక దాడులు చేపట్టారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు 4 గంటలసేపు నిరవధికంగా ఈ దాడులు కొనసాగాయి. ఈ ప్రాంతంలో 2 భారీ సారా తయారీ శిబిరాలను ధ్వంసం చేశారు. ఈ ప్రాంగణాల్లో మురుగుతున్న సారా జప్తు చేశారు. సుమారు వెయ్యి లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, 7 మంది నిందితులను అరెస్టు చేశారు. గంజాం జిల్లా చికిటి ప్రాంతం కల్తీ సారా మృత్యు ఘటన తర్వాత రాష్ట్రంలో కల్తీ, నాటు సారా వ్యవస్థని మట్టుబెడతామని రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ దిశలో విభాగం కార్యాచరణ చురుకుగా కొనసాగుతోంది. నాటుసారా వంటకం, పంపిణీ, విక్రయంలో సాలియా సాహి ప్రముఖ కేంద్రంగా చలామణి అవుతోంది. ఈ ప్రాంతంపై అబ్కారీ విభాగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది.



ఊట డ్రమ్ములను పారబోస్తున్న పోలీసులు

భలే.. భలే.. బొమ్మల కొలువు



శైలశ్రీ విహార్‌లో కామేశ్వరి పూర్ణ బొమ్మల కొలువు



చంద్రశేఖర పూర్ పేరి వారింట ప్రకృతి రమణీయ బొమ్మల కొలువు

భువనేశ్వర్: దసరా వేడుకల్లో ఆబాలగోపాలం ఆనంద హేళతో సందడిగా ఉన్నారు. నగర వీధుల్లో భారీ పందిళ్లలో దేవీ శోభాయమానంగా పూజలందుకుంటోంది. దక్షిణాది కుటుంబాల ఇండ్లలో బొమ్మల కొలువు సందడి చేస్తోంది. ప్రాచీన సంప్రదాయ పరిరక్షణ దిశలో ఈ కుటుంబాల్లో మహిళలు ప్రత్యేకంగా క్రమపద్ధతిలో అమర్చి బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పరిచిత బంధుమిత్రులు కొలువులోని బొమ్మల పేరికపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొమ్మల కొలువు సందర్శన కోసం విచ్చేస్తున్న సన్నిహిత పుణ్యస్త్రీలకు తాంబూలం అందజేసి ఆశీస్సులు అందుకుంటున్నారు. ఇంటింటా దసరా వేడుకలు ఆత్మీయుల ఆగమనంతో కళకళలాడుతున్నాయి.



భువనేశ్వర్‌లోని నితురుభా జె.మదన్ ఇంట అష్టలక్ష్మీ వైభవం బొమ్మల కొలువు

క్లుప్తంగా

ప్రపంచ కళా జాతరకు ఆలితిప్పలు నాటిక

టెక్కలి: ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరకు టెక్కలి ప్రజా చైతన్య కళా సమితికి చెందిన 'ఆలి తిప్పలు' నాటిక ఎంపికైనట్లు దర్శకుడు డీఏ.స్టాలిన్ గురువారం తెలిపారు. ఈ మేరకు ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సమితి నుంచి ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. ఈ నెల 19న తాడేపల్లిగూడేంలో ఈ నాటిక ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. నటులు మూల తాతయ్య, జానపద కళాకారుడు కుమార్ నాయక్, నటులు వేదవ్యాస్, తదితరులు నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు.

జిల్లా ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్‌గా సత్తిబాబు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్ (ఫస్ట్ బెటాలియన్)గా పి.సత్తిబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఇంటిలిజెన్సు విభాగంలో అడిషనల్ కమాండెంట్‌గా ఉన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనం చెల్లింపు

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలల వేతనాన్ని వర్సిటీ అధికారులు గురువారం చెల్లించారు. ఈఎస్ఐ, పీఎఫ్, జీఎస్టీ, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కమిషన్ పోగా, రెండు శ్లాబుల్లో ఉద్యోగులకు రూ.16461, రూ.13000 చొప్పున చెల్లించారు. జనవరి 1న వీరు విధుల్లో చేరగా ఇంత వరకు వేతనం అందజేయలేదు. ఇటీవల లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో మొదటి విడతగా రెండు నెలల వేతనం చెల్లించారు. ఈ నెల 19న లేబర్ కమిషనర్ కార్యాలయంలో విచారణ ఉంది. ఆలోగా పూర్తిస్థాయి వేతనం చెల్లిస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

పాతపట్నంలో ట్రాఫిక్ ఆంక్షలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ రామారావు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం వద్ద దసరా పండగ నేపథ్యంలో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీఐ ఎన్.రామారావు తెలిపారు. పాతపట్నం, మెళియాపుట్టి పోలీసులతో పాటు రిజర్వు పోలీసులతో శని, ఆదివారం బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లపై గురువారం ఆలయ ఈవో వాసుదేవరావుతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామని, వాహన పూజలు ఆలయం ముందు చేసుకోవాలని చెప్పారు.

'కూల్'గా గొలుసు చోరీ

కాశీబుగ్గ: మందస మండలం మకరజోల గ్రామంలో గురువారం వడ్డి దమయంతి అనే చిరువ్యాపారి దుకాణంలో గొలుసు చోరీ జరిగింది. ఓ దుండగుడు కూల్ డ్రింక్ కావాలని అడిగి ఒక్కసారిగా దమయంతిని నెట్టేశాడు. ఆమె ధరించిన రెండు తులాల బంగారు గొలుసును తెంచుకుని పారిపోయాడు. బాధితురాలు తేరుకుని కేకలు వేసినా ఫలితం లేకపోయింది. అనంతరం బాధితురాలు మందస పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వనవిష్ణుపురం కేసులో ముగ్గురు అరెస్టు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట: పోలాకి మండలం వనవిష్ణుపురంలో మంగళవారం జరిగిన హత్య కేసుకు సంబంధించి ముగ్గురిని గురువారం అరెస్టు చేశామని నరసన్నపేట సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. వీరాస్వామి హత్య కేసులో ఏ–1 పాలిన కృష్ణమూర్తి, ఏ–4 తలగాన పిల్లయ్య, ఏ–5 తలగాన దుర్గారావులను అరెస్టు చేశామని, మరో 9 మందిని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు. వీరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతుందని తెలిపారు. ప్రతిఒక్కరూ శాంతియుతంగా ఉండాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

డ్రైనేజీలో గుర్తు తెలియని మృతదేహం




మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలోని ఓ డ్రైనేజీలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శరీరంపై గాయాలుండటంతో మద్యం సేవించి డ్రైనేజీలో పడిపోయి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. రెండో పట్టణ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

జై దుర్గా భవానీ..!




పర్లాకిమిడి: గాంధీ జంక్షన్‌లో...



పర్లాకిమిడి: హైస్కూల్ జంక్షన్ వద్ద...



పర్లాకిమిడి: రైల్వేస్టేషన్ రోడ్డు రాజగురు వీధిలో..



పర్లాకిమిడి: ఖంజావీధి వద్ద మాశ్యామకాళీ రూపంలో..



రాయగడ: నీలిరంగు పూలతో ముస్తాబైన మజ్జిగౌరి సన్నిధి



రాయగడ: పోలీస్ క్వార్టర్స్ వద్ద పూజలందుకుంటున్న అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. దీంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించారు. పలువురు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: కస్తూరీ నగర్‌లో దుర్గా అవతారంలో లక్ష్మీ అమ్మవారు



రాయగడ: ఎస్‌బీఐ కూడలిలో దుర్గామాత



రాయగడ: బ్రాహ్మణ వీధిలో పూజలందుకుంటున్న దుర్గామాత

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు



ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుల శారీరక కౌశల ప్రదర్శన



మాట్లాడుతున్న సుశాంత పండా

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యా మందిర్ ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయ దశమి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా ప్రాంతీయ ముఖ్య ప్రచారకులు సుశాంత పండా, దేవీ మఠం మహంత రామానంద దాస్, సహ సంఘ్ పర్యవేక్షకులు గౌరంగ పాణిగ్రాహి పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్ శత వార్షికోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా సంఘ్ విధానాలు, వాటి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా వందమంది ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు తాము నేర్చుకున్న శారీరక కౌశల విద్యలను ప్రదర్శించారు. ఈ సమావేశాలు పర్లాకిమిడిలో మూడు రోజుల పాటు జరుగుతాయని గౌరంగ పాణిగ్రాహి తెలియజేశారు.

నదిలో దూకి యువకుడు గల్లంతు



బ్రాహ్మణి నదిలో గాలిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: మేనమామ ఇంటి నుంచి సైకిలుపై తమ ఇంటికి తీసుకొస్తుండగా హఠాత్తుగా వంతెన పైనుంచి నదిలోకి యువకుడు దూకిన సంఘటన కలకలం రేపింది. ఢెంకనాల్ జిల్లా భువన్ ఠాణా బాజీ రౌత్ సేతు పైనుంచి బ్రాహ్మణి నదిలోకి దూకిన యువకుడి కోసం గాలిస్తున్నారు. మేనమామ ఇంట్లో ఉంటున్న పరుశరామ్ కుంభార్‌ని సైకిలుపై తన స్వగ్రామం కీర్తనపూర్‌కు తీసుకొస్తుండగా బాజీ రౌత్ వంతెన పైనుంచి నదిలోకి దూకాడు. బుధవారం చీకటి పడుతున్న సమయంలో ఆకస్మికంగా చోటు చేసుకుంది. అగ్నిమాపక దళానికి సమాచారం అందజేయడంతో గాలించేందుకు నదిలోకి దిగారు. రాత్రి కావడంతో గాలింపు వాయిదా వేసి గురువారం గాలింపు నిరవధికంగా కొనసాగించారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత శ్రీకాకుళం



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న నిర్వాహకులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. నాలుగు రోజులుగా నిర్వహించిన పోటీలు గురువారం ముగియడంతో నిర్వాహకుల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 112 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో అమలపాడు, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. ఉత్కంఠ పోరులో విజేతగా నిలిచిన వారికి స్పాన్సర్ లింగూడు సోమేశ్వరరావు రూ.30వేలు నగదు, ట్రోఫీ బహూకరించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన అమలపాడుకు రూ.25వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కేఆర్ స్టేడియం జట్టుకు రూ.20వేలు, నాలుగో స్థానంలో నిలిచిన గొల్లమాకన్నపల్లి జట్టుకు రూ.15వేలు, 5వ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం గల్లీ బాయ్స్ జట్టుకు రూ.8వేలు నగదును స్పాన్సర్లు సత్య బ్రదర్స్, నేను నా క్లాస్‌మేట్స్, యూఆర్‌కేపురం జగదాంబ సెంటర్, పవన్ అండ్ సత్యంగ్రూపు సభ్యులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింత హేమారావు, మాజీ సర్పంచ్ చింత నారాయణ మూర్తి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

చిన్నారి మృతితో ఆందోళన



చిన్నారి జశ్విక (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని బొందిలీపురంలో ఏ–1 ఆస్పత్రిలో విషాద ఘటన చోటు చేసుకుంది. చికిత్స పొందుతున్న చిన్నారి మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని చేపలవీధిలో నివసిస్తున్న టి.శ్రావణ్‌కుమార్, హిమబిందుల ఏడాదిన్నర కుమార్తెకు తరచూ వాంతుల సమస్య ఉండేది. కడుపులో ఏదైనా సమస్య ఉందేమోనని అనుమానమొచ్చి సెప్టెంబరు 17న ఏ–1 ఆస్పత్రిలో చేర్చారు. అక్కడికి వారం రోజుల తర్వాత సిటీ స్కాన్, ఎండోస్కోపీ చేశారు. పేగు మడత పడటంతో సర్జరీ అవసరమని, దీనికి రూ.లక్షా80 వేలు కట్టాల్సి ఉంటుందని చెప్పడంతో రూ.లక్షా 66 వేలు కట్టారు. మరుసటి రోజు మరో రూ.10 వేలు చెల్లించారు. గత నెల 31న వైద్యులు సర్జరీ చేశారు. బుధవారం రాత్రి పాప ఏడవడంతో నర్సులు 0.5 ఎం.జి. మత్తు డ్రగ్ ఇవ్వగా.. అక్కడికి కొద్ది క్షణాల్లోనే కాళ్లు, చేతులు గిలగిలా కొట్టుకోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. కాసేపటికి నార్మల్ అయిపోతుందని సిబ్బంది చెప్పడంతో ఆగిపోయారు. గురువారం ఉదయం ఆరు గంటలకు వెళ్లి చూసేసరికి పాప చనిపోవడంతో తల్లిదండ్రులు హిమబిందు, శ్రావణ్‌లు బోరున విలపించారు. ఆస్పత్రి తీరుకు నిరసనగా బంధువులతో కలిసి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడంతో పాప మృతదేహాన్ని పట్టుకుని కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని సీఐ గుండు మోను ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

వినూత్న నిరసన



అడ్మిట్ కార్డులు కాగితపు పడవలుగా చేసి నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

భువనేశ్వర్: రాష్ట్రంలో అమీన్, రెవెన్యు ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై నిరుద్యోగులు నిరవధికంగా నిరసన తెలుపుతున్నారు. ఒడిశా సబ్ ఆర్డినేట్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉద్యోగాల భర్తీ పరీక్షలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయని వారు ఆరోపిస్తున్నారు. దీంతో ఇదివరకే మంత్రి నివాసం ముట్టడి, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిరసన ప్రదర్శన వంటి ఆందోళనలు చేపట్టారు. కాగా బుధవారం రాత్రి పరీక్షల కోసం జారీ చేసిన అడ్మిటు కార్డులను దహనం చేసి నిరసన ప్రదర్శించారు. అనంతరం గురువారం ఉదయం కటక్ కఠొజొడి నదీ తీరంలో నిరసనకారులు గుమిగూడి తమ అడ్మిట్ కార్డులను కాగితపు పడవలుగా చేసి, నదిలో వదిలి విభిన్న రీతిలో నిరసన ప్రదర్శించారు. ఈ సంఘటనపై రాష్ట్ర రెవెన్యు శాఖ మంత్రి నిరంజన్ పూజారి దృష్టిని నిరసనకారులు ఆకట్టుకున్నారు. ప్రయోజనం శూన్యం కావడంతో అంచెలంచెలుగా ఆందోళన ఉధృతం చేస్తున్నారు. అమీన్, రెవెన్యు ఇనస్పెక్టర్ పరీక్షల్ని రద్దుచేసి, తాజాగా పారదర్శక నియమాలతో మరోసారి నిర్వహించాలని వీరంతా డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండుపై రాష్ట్ర ప్రభుత్వం పెదవి కదపకుండా పరిస్థితిని పరిశీలిస్తోంది.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రారంభం

మల్కన్‌గిరి:



కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ సిబ్బంది

జిల్లా కేంద్రంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌ను గురువారం ప్రారంభించారు. బ్యాంక్ మేనేజర్ ఆశిష్ పాత్రో జ్యోతి వెలిగించారు. అలాగే ఏటీఎం సెంటర్ సైతం ప్రారంభించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ రవికాంత్ బెహర తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ కౌన్సెలింగ్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న ఓకేసీఎల్ ప్రోగ్రామ్ మేనేజర్ సుశాంత్ దాస్



హాజరైన విద్యార్థులు

జిల్లా కేంద్రంలో ఉన్న మల్కన్‌గిరి కాలేజీలో ఓకేసీఎల్ కెరీర్ కౌన్సెలింగ్ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. భువనేశ్వర్ నుంచి ఓకేసీఎల్ ప్రోగ్రామ్ మేనేజర్ సుశాంత్ కుమార్ దాస్ విచ్చేసి విద్యార్థులకు పలు ఓకేసీఎల్ కోర్సులు గురించి అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి కళాశాల ప్రిన్స్‌పాల్ లింగరాజ్ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి

క్లుప్తంగా

బాలికల కంటి దృష్టిపైన తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

• డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: బాలికల కంటి దృష్టిపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోను చిన్నారుల్లో బాలుర కంటే బాలికల్లో దృష్టి సమస్యలు అధికంగా ఉన్నట్లు సర్వేలు తెలియ జేస్తున్నాయన్నారు. బాలికలు తగిన పోషకాహారం తీసుకోక పోవడమే ఇందుకు కారణమన్నారు. బాలురుతో సమానంగా బాలికలు ఆరుబయట ఆటలకు సమయం వెచ్చించక, నాలుగు గోడల మధ్య అధిక సమయం చదువు, టీవీ, ల్యాప్‌టాప్, కంప్యూటర్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అతుక్కుని పోవడం వల్ల దృష్టి సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. దృష్టి లోపాలున్న బాలికలు కంటి అద్దాల వాడకంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపడం లేదని, దీని వల్ల వారు చదువులో వెనుకబడి పోతున్నారన్నారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, తారకేశ్వరావు, వెంకటేశ్వరరావు, చంద్రశేఖరరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఆటోడ్రైవర్ కూతురు



జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన మౌనికను అభినందిస్తున్న హెచ్ఎం భాస్కరరావు, పీడీ రత్నకిశోర్

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రొంగలి మౌనిక జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రత్నకిశోర్ గురువారం తెలిపారు. ఈ విద్యార్థిని తండ్రి తిరుపతిరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మౌనిక ఇటీవల ఏలురులో జరిగిన స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్ 19 విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచింది. విజయనగరం జిల్లా తరపున పోటీల్లో పాల్గొన్న ఈమె వచ్చే నెలలో గుజరాత్‌లో జరగబోయే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ చాపింయన్‌షిప్ పోటీల్లో రాష్ట్రజట్టులో చోటు సంపాదించింది. జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడలకు ఎంపికైన మౌ నికను తల్లిదండ్రులతో పాటు పాఠశాల హెచ్ఎం రావాడ భా స్కరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

జామి విద్యార్థి కూడా..



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జశ్వంత్

జామి: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జామి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పి.జశ్వంత్ ఎంపికయ్యాడు.ఈనెల 7,8,9 తేదీల్లో రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జశ్వంత్ చక్కని ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో తెలంగాణలో జరిగే పోటీల్లో జశ్వంత్ పాల్గొననున్నట్లు పీడీ చంద్రశేఖర్ తెలిపారు. జాతీయస్థాయిలో చక్కని ప్రతిభ కనబరిచి పతకం సాధించాలని హెచ్ఎం రెహమాన్, పీడీలు చంద్రశేఖర్, ఎర్నమ్మ ఆకాంక్షించారు.

విజయవంతంగా ఆపరేషన్ స్వేచ్ఛ

• జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు
• షాపుల్లో పనిచేసే బాలల గుర్తింపు. తల్లిదండ్రులకు అప్పగింత. కౌన్సెలింగ్

విజయనగరం క్రైమ్: తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురై వీధుల్లో తిరుగుతున్న బాలలు, వివిధ పనులు చేస్తున్న బాల కార్మికులను గుర్తించి తిరిగి బడిబాట పట్టించేందుకు రాష్ట్ర సీఐడీ అధికారుల ఆదేశాలతో జిల్లాలో ఐదు రోజుల పాటు చేపట్టిన 'ఆపరేషన్ స్వేచ్ఛ' కార్యక్రమం విజయవంతమైందని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న కార్మికశాఖ అధికారులు, పోలీసులు, ఇతర శాఖలకు చెందిన లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలను పర్యవేక్షించేందుకు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇ.నరసింహమూర్తిని నోడల్ అధికారిగా నియమించామని చెప్పారు. ఈ బృందాలు విజయనగరం పట్టణం, కొత్తవలస, ఎల్.కోట, బొబ్బిలి, తెర్లాం, నెల్లిమర్ల, వేపాడ, రామభద్రపురం, జామి, బాడంగి, ఎస్.కోట, చీపురుపల్లి, గరివిడి, రాజాం, ఆర్.ఎ.వలస, సంతకవిటి, వంగర మండలాల్లోని ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు, బట్టలు, చెప్పుల దుకాణాలు, హోటల్స్, స్వీట్, టీ, నగల షాపుల్లో పనులు చేస్తున్న బాలలను గుర్తించాయన్నారు. పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి బడిబాట పట్టించేలా చర్యలు చేపట్టాయని తెలిపారు. వీధి బాలలను తిరిగి బడిబాట పట్టే విధంగా చర్యలు చేపట్టాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని షాపు యజమానులు, తల్లిదండ్రులను హెచ్చరించామన్నారు. కొన్నిచోట్ల షాపుల యజమానులకు కార్మిక శాఖ అధికారులు జరిమానా విధించాయన్నారు.

లాభాల బాటలో రైతు బజార్‌లు

• వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంస్కరణలే కారణం
• నెలకు రూ.7.16 లక్షల ఆదాయం

రైతు బజార్లకు వచ్చే ఆదాయం ఖర్చు వివరాలు

రైతుబజారుపేరు	ఆదాయం	ఖర్చు
ఆర్అండ్‌బీ	రూ.2.55,500	రూ.91,500
రింగ్‌రోడ్	రూ.1,85,000	రూ.1.08,000
ఎంఆర్ ఆస్పత్రి	రూ.69,000	రూ.68,000
చీపురుపల్లి	రూ.11,900	రూ. 24,000
రాజాం	రూ.20,600	రూ.43,800
ఎస్.కోట	రూ.1,52,700	రూ.93,800
కొఠారుబిల్లి	రూ.22,000	రూ.6,200



అర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద రైతు బజార్

విజయనగరం ఫోర్ట్: గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతు బజార్లలో చేపట్టిన సంస్కరణల వల్ల అవి ప్రస్తుతం లాభాల బాటలో నడుస్తున్నాయి. 2019కు ముందు రైతు బజార్ల మనుగడ కష్టంగా ఉండేది. బినామీల వల్ల రైతు బజార్లకు ఎటువంటి ఆదాయం వచ్చేది కాదు. రైతులు కాని వారు కూడా రైతులుగా చలామణి అవుతూ రైతు బజార్లలో దుకాణాలు పొందేవారు. దీంతో సిబ్బందికి జీతాలు చెల్లించడం కూడా కష్టంగా ఉండేది. 2019లో అధికారం చేపట్టిన తర్వాత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పండించిన పంటను సాగుచేసిన రైతే అమ్ముకునేవిధంగా చర్యలు చేపట్టింది.

2019కు ముందు పరిస్థితి

2019కు ముందు ఎటువంటి పంటలు సాగు చేయకపోయినా కూరగాయాలు, ఆకుకూరలు సాగు చేసినట్లు సాగు ధ్రువీకరణ పత్రాలు చూపించి రైతు బజార్లలో దుకాణాలు పొందేవారు. పంటలు సాగు చేయకుండా మార్కెట్‌లో కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి వాటిని రైతు బజార్లలో విక్రయించేవారు. దీని వల్ల రైతు బజార్ల ఏర్పాటులో ఉన్న లక్ష్యం నెరవేరని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంస్కరణలు చేపట్టింది. బినామీలకు అడ్డుకట్టే వేసే విధంగా చర్యలకు ఉపక్రమించింది. రైతు బజార్లలో పంట పండించిన రైతులు ఎంత మంది, మార్కెట్‌లో తెచ్చి పంటను అమ్మినవారు ఎంతమంది అనేది సర్వే చేసి తేల్చింది.

నెలకు రూ. 7.16 లక్షల ఆదాయం

జిల్లాలో ఉన్న ఏడు రైతు బజార్ల ద్వారా నెలకు రూ.7.16 లక్షల వరకు ఆదాయం వస్తోంది. సిబ్బంది జీతాలు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.4.35 లక్షలు అవుతుంది. ఖర్చులు పోను రూ.2.81 లక్షల వరకు నెలకు మిగులుతుంది.

సాగు ధ్రువీకరణ పత్రాలతో చెలామణి

రైతు బజార్లలో కూరగాయలు అమ్ముకోవడానికి షాపు కేటాయించాలంటే కూరగాయలు, లేదా ఆకు కూరలు సాగుచేస్తున్నట్లు వీఆర్వో సాగు ధ్రువీకరణ పత్రం ఇస్తే సరిపోయేది. దీంతో పంట సాగు చేయచేయకపోయినా వీఆర్వో ఇచ్చే సాగు ధ్రువీకరణ పత్రాలు ఏదోవిధంగా సంపాదించి వాటితో షాపులు పొంది చలామణి అయ్యేవారు. దీంతో పంట పండించిన రైతులకు షాపులు దొరికేవి కావు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అర్హులను గుర్తించేందుకు నిబంధనల్లో మార్పులు చేసింది. రైతులు పండించే పంట (కూరగాయలు, ఆకుకూరలు) ఈ-క్రాప్‌లో నమోదు అయితేనే రైతులకు షాపులను కేటాయించేలా మార్పులు చేసింది. దీనివల్ల బయట మార్కెట్ నుంచి తెచ్చి విక్రయించేవారికి చెక్ పడింది. వారికి ఉచితంగా షాపులు కేటాయించలేదు. వారిని వాణిజ్య విభాగంలోకి బదలాయించి వారి నుంచి అద్దె వసూలు చేయడం ప్రారంభించారు. దీనివల్ల అర్హులకు పంట అమ్ముకునే పరిస్థితి వచ్చింది. వ్యాపారం చేసుకునేవారికి షాపులు కేటాయించడం వల్ల రైతు బజార్లకు ఆదాయం పెరిగింది.



రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

జిల్లాలో 7 రైతు బజార్లు

ఉమడి జిల్లాలో ఏడు రైతు బజార్లు ఉన్నాయి. జిల్లా కేంద్రం విజయనగరంలో ఆర్అండ్‌బీ, దాసన్నపేట, పాత ఎంఆర్‌ఆస్పత్రి వద్ద రైతు బజార్లు ఉన్నాయి. అలాగే పార్వతీపురం, ఎస్.కోట, చీపురుపల్లి, కొఠారుబిల్లి వద్ద రైతు బజార్లు ఉన్నాయి. వాటి పరిధిలో 300 మంది వరకు రైతులు ఉన్నారు.

ఆదాయం బాగుంది

రైతు బజార్లకు ఆదాయం బాగుంది. ఒకటి రెండు రైతు బజార్లు మినహా మిగిలిన రైతు బజార్లకు ఖర్చులు పోని ఆదాయం వస్తుంది. మార్కెట్ నుంచి కొనుగోలు చేసి విక్రయించే వారిని వాణిజ్య పరిధిలోకి మార్పు చేసి వారి నుంచి అంగీకారమైన అద్దెను వసూలు చేసి విధంగా గతంలో చర్యలు చేపట్టడం వల్ల రైతు బజార్లకు ఆదాయం వస్తోంది.

బి. రవికిరణ్, మార్కెటింగ్‌శాఖ ఎ.డి

ఘాట్‌రోడ్‌లో వ్యాన్ బోల్తా: ఒకరి మృతి

• క్షేమంగా బయట పడిన ఇద్దరు



లోయలో బోల్తాపడిన వ్యాన్ పరిశీలిస్తున్న ఎస్సై అమ్మన్నాయుడు



సతీష్ (ఫైల్)

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో బొమ్మిక-కోతాం రెండవ మలుపు వద్ద ఘాట్‌రోడ్‌లో గురువారం వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం డివిజన్ రంగంపేట మండలం సుభద్రంపేట గ్రామానికి చెందిన కొత్తపల్లి సతీష్ (33) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు వ్యక్తులు వాహనం నుంచి దూకేయడంతో క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటనపై ఎస్సై వై.అమ్మన్నరావు అందించిన వివరాల ప్రకారం సీతపేట మండలంలోని సార గ్రామ సమీపంలో బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ బ్యాటరీలు, సోలార్ వస్తువులు దాదాపు 4 టన్నుల పరిమాణం గల బరువును రాజమహేంద్రవరం నుంచి ఐషర్ వ్యాన్‌లో తీసుకువస్తున్నారు. డ్రైవర్ లోవరాజు, శ్రీను, సతీష్‌లు వ్యాన్‌లో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కోతాం మలుపు వద్దకు వచ్చేసరికి బ్రేక్ ఫెయిల్ అవడంతో రహదారిపక్కన సుమారు 20 అడుగుల లోయలో వ్యాన్ పడిపోయింది. వ్యాన్‌నుంచి ఒక్క ఉదుటన బయటకు గెంతేసిన లోవరాజు, శ్రీనులు క్షేమంగా ఉన్నారు. వ్యాన్ వెనుకన కూర్చుని ఉన్న సతీష్ వ్యాన్‌తో పాటు లోయలో పడి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమాచారమందుకున్న కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరై విలపించారు.

చికిత్స పొందుతూ యువతి..



చికిత్స పొందుతూ మృతిచెందిన పూర్ణిమా దేవి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెందిన కూతురు ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పడంతో చికిత్స పొందుతూ మృతిచెందింది. కురుపాం మండల కేంద్రంలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కురుపాంలోని శివ్వాల వీధికి చెందిన ఉంజేటి పూర్ణిమాదేవి(17)ని కాలేజీకి సరిగ్గా వెళ్లడం లేదని, చదువుకోవడం లేదని తల్లిదండ్రులు గత నెల 20వ తేదీన మందలించడంతో అదే రోజు రాత్రి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగేసింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే కురుపాం సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అలనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు గత నెల 24న తీసుకెళ్లారు. అప్పటినుంచి చికిత్స పొందుతున్న ఆమె గురువారం సాయంత్రం 5గంటల సమయంలో మృతిచెందింది. ఈ ఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ కుటుంబాలకు సహాయ సహకారాలు

• ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవ్ రెడ్డి



హాజరైన పోలీసు కుటుంబసభ్యులు

పార్వతీపురం టౌన్: పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, దివంగత పోలీస్ ఉద్యోగుల కుటుంబసభ్యులు హోంగార్డ్స్ కుటుంబసభ్యులతో గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి వ్యక్తిగత, ప్రభుత్వం నుంచి ఇంకనూ రావలసిన బకాయిలు వారికి అందవలసిన బెనిఫిట్స్, యోగక్షేమాలు, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ విరమణ సిబ్బంది, మరణించిన సిబ్బంది కుటుంబసభ్యుల యోగక్షేమాలు, పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి చెందవలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వం నుంచి రావాల్సిన భద్రత, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, విడో ఫండ్, కార్పస్, అడిషనల్ ఫండ్, ఏఐ, లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ నగదు వంటి రాయితీలు సకాలంలో అందిందీ లేనిదీ తెలుసుకున్నారు. అందని పక్షంలో త్వరితగతిన అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వారి పెండింగ్ ఫైల్స్ గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత డీపీఓ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రిటైర్డ్ పోలీస్ సిబ్బందికి వారి ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఎస్పీ పలు సలహాలు అందజేశారు. పోలీస్‌శాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు.

మృతుడి కుటుంబసభ్యులకు చెక్కు అందజేత

విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలవల్ల మరణించిన సిబ్బంది హెచ్‌సీ పి.శ్రీనివాసరావు సతీమణి పి.రజనికుమారికి విడో ఫండ్ రూ. 50,000 చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సీఐ జీడీ బాబు, ఏఆర్ ఆర్ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, టి. శ్రీనివాసరావు, డీపీఓ ఏఏఓ జె.త్రినాథ, సత్యం, సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, డీపీఓ సిబ్బంది, మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఆరుగురి అరెస్ట్



గంజాయి కేసులో ఆరెస్ట్ చేసిన నిందితులతో డీఎస్పీ రాఘవులు, సీఐ శంకరరావు, ఎస్సై నారాయణరావు



పట్టుబడిన గంజాయి

గుర్ల: మండలంలోని సాలిపిసోమరాజు పేట చంపావతి నది పరీవాహక ప్రాంతంలో గంజాయి అమ్మకం, కొనుగోలు చేస్తున్న ఆరుగురు వ్యక్తులను ఆరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎస్.రాఘవులు గురువారం తెలిపారు. నిందితుల నుంచి 2కేజీల గంజాయి, 5 మొబైల్ ఫోన్లు, రూ.1250 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని చెప్పారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాఘవులు మాట్లాడుతూ అరెస్ట్ చేసిన గంజాయి నిందితుల్లో అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకు మండలంలోని సుంకరిమెట్ట గ్రామానికి చెందిన మజ్జి అప్పన్న (ఎ1), విజయనగరం జిల్లా జామి మండలంలోని అలమండ గ్రామానికి చెందిన దాసరి గాంధీ (ఎ2), విజయనగరం పట్టణంలోని సుంకరి వీధికి చెందిన తాడ్డి సాయి కల్యాణ్ (ఎ3), తోటపాలెం ప్రాంతానికి చెందిన కిలాడ విద్యాసాగర్ (ఎ4), బాబామెట్టకు చెందిన చింతలూరి తేజేశ్వరరావు (ఎ5), శివాలయం వీధికి చెందిన అలజంగి జోసెఫ్ (ఎ6)లు ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులో మజ్జి అప్పన్న, దాసరి గాంధీ గంజాయి సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. సాయి కల్యాణ్, విద్యా సాగర్, తేజేశ్వరరావు, జోసెఫ్‌లు గంజాయి వినియోగానికి అలవాటు పడిన వ్యక్తులుగా గుర్తించి అరెస్ట్ చేశామని వివరించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసిన చీపురుపల్లి సీఐ జి.శంకరరావు, ఎస్సై పి.నారాయణరావు, గుర్ల పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రాఘవులు అభినందించారు.

గంజాయి నిందితుడి అరెస్ట్



పట్టుబడిన నిందితుడితో సీఐ రమణమూర్తి, కానిస్టేబుల్స్

శృంగవరపుకోట: గంజాయి అక్రమ రవాణా కేసులో పాత నిందితుడిని గురువారం ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అదుపులోకి తీసుకున్నామని సీఐ రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో బొలెరో వాహనంలో 200 కిలోల గంజాయి అక్రమ రవాణా కేసులో ప్రధాన నిందితుడైన ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా, పాడువ పరిధిలో బోస్‌పూట్ గ్రామానికి చెందిన పతి కిలా అనే నిందితుడు తప్పించుకుని తిరుతున్నాడని, ఆ నిందితుడు ఆర్టీసీ కాంప్లెక్స్ మధ్య గేటు వద్ద ఉన్నట్లు తమకు అందిన కచ్చితమైన సమాచారంతో వెళ్లి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ వివరించారు.

పెట్రోలు బంకుల్లో ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి: పట్టణంలోని పలు పెట్రోలు బంకుల్లో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్‌కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని పెట్రోలు బంకులకు వెళ్లిన ఆయన అక్కడ విక్రయిస్తున్న పెట్రోలు, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొలత ప్రకారం పెట్రోలు, డీజిలు అమ్మకాలు చేపట్టాలని, నాణ్యత తగ్గినా, కొలత ప్రకారం ఇంధనాలు పోయకపోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

• ఏపీ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ డిమాండ్



ముక్తిధాం సమీపంలో కొబ్బరిసాగును పరిశీలిస్తున్న కోకోనట్‌బోర్డు సభ్యులు

పూసపాటిరేగ: కొబ్బరి అత్యధికంగా పండిస్తున్న ఉద్దానం ప్రాంతంలో కోకోనట్‌బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని, కొబ్బరి రైతులకు మద్దతు ధర కల్పించాలని ఏపీ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని గోవిందపురం ముక్తిధాం క్షేత్రంలో ఏపీ కొబ్బరి రైతుల సంఘం ఆధ్వర్యంలో కోకోనట్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మొంగం శ్రీనివాసరావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కొబ్బరి రైతుల సమస్యలు గుర్తించి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొబ్బరి రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. కేంద్రప్రభుత్వం కొబ్బరికి ప్రకటిస్తున్న మద్దతు ధర పెరిగిన ఖర్చుల రీత్యా ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. 2024-25 సంవత్సరంలో కేంద్రప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.18 వేలు ఉండాలని కోరారు. విజయనగరం ప్రాంతంలో కొబ్బరి బొండాం రూ.12 నుంచి రూ.15 మాత్రమే ఇస్తున్నారని అదే వ్యాపారులు బొండాం రూ.30కి విక్రయిస్తున్నారన్నారు. రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడంతో మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బొండానికి రూ.25 మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కొబ్బరికి వచ్చే తెగులుకు ఉద్యానవన శాఖ ద్వారా సామూహిక నివారణ చర్యలు చేపట్టాలని, ప్రతి చెట్టుకు పంటల బీమా పథకం అమలు చేయాలని కోరారు. కొబ్బరి బోర్డు ద్వారా రైతులకు సబ్సిడీ పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కోకోనట్ ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి పబ్బిరెడ్డి అప్పడుదొర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, రైతు సంఘం నాయకులు కృష్ణారావు, ఎరకయ్యదొర, డి.ఈశ్వర్రావు, విక్రం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

'విజ్జి' స్టేడియం వేదికగా క్రీడోత్సవాలు

• నాలుగు క్రీడాంశాల్లో పాల్గొననున్న వివిధ జిల్లాల క్రీడాకారులు
• స్కేటింగ్ క్రీడాంశంలో జిల్లాస్థాయిలో పోటీలు



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

విజయనగరం: ఏడాదికోసారి నిర్వహించే విజయనగరం ఉత్సవాల్లో భాగంగా క్రీడోత్సవాల నిర్వహణకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13,14తేదీల్లో రెండు రోజుల పాటు రూ.13.10 లక్షల వ్యయంతో వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. నగర శివారులో గల విజ్జి స్టేడియం వేదికగా 5 క్రీడాంశాల్లో నిర్వహించే పోటీల్లో 600 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్కేటింగ్ క్రీడాంశాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతుండగా..విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించనున్నారు. బాలికలకు బాబామెట్టలోని బాలికల ఉన్నత పాఠశాలను కేటాయించగా..బాలురుకు యూత్ హాస్టల్, బాబామెట్ట మోడల్ స్కూల్, కబడ్డీ ఖోఖో అకాడమీ ప్రాంతాలను కేటాయించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రెండవ రోజు సోమవారం బహుమతులు ప్రదానం చేయనున్నారు.

నాలుగు అంశాల్లో ఆహ్వానపు పోటీలు

ప్రతి ఏడాది విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే క్రీడోత్సవాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తుండగా..ఈ ఏడాది వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులను పోటీల్లో పాల్గొనేందుకు ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో జరిగే పోటీల్లో ఆతిథ్య విజయనగరం జిల్లాతో పాటు పార్వతీపురం-మన్యం జిల్లా, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, అరకు, పాడేరు, అనకాపల్లి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీ పడనున్నారు. రెండురోజుల పాటు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించే పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆయా క్రీడాంశాల వారీగా ప్రథమ బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నారు.

క్రీడోత్సవాలను విజయవంతం చేయండి

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలి. రూ.13.10 లక్షల వ్యయంతో 5 క్రీడాంశాల్లో నిర్వహించే పోటీల్లో 600 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నాం. అలాగే క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తాం.

ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి, విజయనగరం

జిల్లాస్థాయిలో స్కేటింగ్ పోటీలు

క్రీడోత్సవాల్లో భాగంగా స్కేటింగ్ క్రీడాంశంలో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. వివిధ వయస్సుల విభాగాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నారు.

రైతునేస్తం పురస్కారానికి గౌరీశ్వరరావు ఎంపిక



రాజాం సిటీ: పట్టణంలోని అమ్మ వారికాలనీలో ఉంటున్న రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెంకి గౌరీశ్వరరావు రైతునేస్తం పురస్కారానికి ఎంపిక య్యారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబసభ్యులు గురువారం తెలిపారు. పద్మశ్రీ డాక్టర్ ఐవీ సుబ్బారావు పేరిట రైతు నేస్తం 20 వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రంలో 20 మంది రైతులను ఈ పురస్కారాలకు ఎంపికచేయగా, వారిలో గౌరీశ్వరరావుకు కూడా స్థానం లభించింది. ఆయన స్వగ్రామం వంగర మండలంలోని కొత్తవలస. ఆయనకు ఊహ తెలిసినప్పటి నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. పలు ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయ రైతు సదస్సులు ఏర్పాటుచేశారు. ఈనెల 20న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా కృష్ణాజిల్లా ఆత్కూరు వద్ద స్వర్ణభారతి ట్రస్టులో ఈ అవార్డును ఆయన అందుకోనున్నారు. ఈ సందర్భంగా గౌరీశ్వరరావును పలువురు అభినందించారు.